

సాక్షి
గుంటూరు
సోమవారం । 23 । సెప్టెంబర్ । 2024



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 29.928 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 45.61 టీఎంసీలు నిల్వ ఉంది.



7713 క్యూసెక్కులు విడుదల

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 7713 క్యూసెక్కులు విడుదల చేశారు.



సుబ్రహ్మణ్యేశ్వర సన్నిధి కిటకిట

మోపిదేవి: సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. సుదూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది.

న్యూస్‌రీల్

బంగారు తాపడం పనులకు రూ. 1.01 లక్షల విరాళం




ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు గుంటూరుకు చెందిన భక్తులు ఆదివారం విరాళాన్ని అందజేశారు. గుంటూరు సంగడిగుంటకు చెందిన పీరం శ్రీనివాసరావు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈవో కె.ఎస్.రామరావును కలిసి బంగారు తాపడం పనులకు రూ. 1,01,116 విరాళాన్ని అందజేసింది. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఈవో వారికి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు.

జెడ్పీ సీఈవోగా జ్యోతిబసు నియామకం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జెడ్పీ సీఈవోగా వి.జ్యోతిబసు నియమితులయ్యారు. అదే విధంగా డిప్యూటీ సీఈవో బాధ్యతలు నిర్వర్తిస్తున్న జె.మోహనరావు నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విజయనగరం జిల్లా డ్వామా ఏపీడీగా పని చేస్తున్న సీహెచ్ కృష్ణను నియమిస్తూ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

శతాధిక వృద్ధుడు మృతి



నెహ్రూనగర్: శతాధిక వృద్ధుడు అట్ల వెంకటరెడ్డి(106) ఆదివారం కొరిటిపాడులో మృతి చెందాడు. 1918లో జన్మించిన ఆయన వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించాడు. ఆయనకు ముగ్గురు ఆడ పిల్లలు, నలుగురు మగపిల్లలు. ఐదు తరాలను చూసిన ఆయన కరోనా సమయంలో ఆసుపత్రి పాలై ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. రెండు రోజుల నుంచి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా ఉండటంతో కుటుంబసభ్యులు ఆయనను ఆసుపత్రికి తీసుకువెళ్లారు. చికిత్స పొందుతూ ఆదివారం కన్నుమూశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అంటే వీరాభిమానం. ఆయన్ను 2013లో కొరిటిపాడు వచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించారు.

రేపటి నుంచి అండర్-19 క్రీడా జట్ల ఎంపికలు



సత్తెనపల్లి: జిల్లాలోని జూనియర్ కళాశాలల విద్యార్థులకు గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా క్రీడా జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి.నరసింహారావు ఆదివారం తెలిపారు. ఈ నెల 24న అచ్చంపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో అండర్-19 బాల బాలికల రెజ్లింగ్ క్రీడా ఎంపికలు, గుంటూరు సమీపంలోని గోరంట్లలో గల నెక్స్‌ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో మోడ్రన్ పెంటాథ్లాన్ క్రీడా ఎంపికలు జరుగుతాయన్నారు. ఈ నెల 28న బాపట్లలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాలలో త్రోబాల్ క్రీడా ఎంపికలు, చిలకలూరిపేట ఏఎంజీ కళాశాలలో బాస్కెట్‌బాల్, బాక్సింగ్ క్రీడా ఎంపికలు జరుగుతాయన్నారు. ఆయా క్రీడా ఎంపికలో పాల్గొనే విద్యార్థులు 2006 జనవరి ఒకటి తర్వాత జన్మించిన వారై ఉండాలని, కళాశాల ప్రిన్సిపాల్ సంతకం చేసిన మార్కుల జిరాక్స్ కాపీని తప్పనిసరిగా క్రీడా ఎంపికలకు తీసుకురావాలని సూచించారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు వినియోగించుకోవాలన్నారు.

పెదకాకాని శివాలయం డిప్యూటీ కమిషనర్‌గా లీలాకుమార్

పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం నూతన డిప్యూటీ కమిషనర్‌గా జీవీడీఎన్ లీలాకుమార్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్ర దేవదాయ ధర్మాదాయశాఖ అధికారుల నుండి ఆదేశాలు జారీ అయ్యాయి. నూతన డీసీగా నియమితులైన లీలాకుమార్ ఇప్పటి వరకూ విజయవాడలోని దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం పెదకాకాని శివాలయం డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న దాసర శ్రీరామ వరప్రసాదరావును మోపిదేవి శ్రీ సుబ్రమణ్యేశ్వరస్వామి దేవస్థానం డిప్యూటీ కమిషనర్‌గా నియమించారు.

పేదింటి ఆణిముత్యాలు

- నీట్‌లో ప్రతిభ చాటిన విద్యార్థినులు
- ఎంజీబీఎస్‌లో ఉచిత సీట్లు కైవసం
- తల్లిదండ్రుల కష్టానికి దక్కిన ప్రతిఫలం



వారంతా నిరుపేద కుటుంబ నేపథ్యం కలిగిన వారు. తల్లిదండ్రులు రోజువారీ కూలీలుగా, దుకాణాల్లో గుమస్తాలుగా, తాపీమేస్త్రీలుగా పనిచేస్తున్నారు. కానీ తమ పిల్లలను మాత్రం కష్టపడి చదివించారు. దాన్ని గుర్తెరిగిన పిల్లలు కూడా మంచిగా చదివి నీట్‌లో ప్రతిభ చాటారు. ఉచిత ఎంబీబీఎస్ సీట్లు సాధించి కన్నవారికి బహుమతిగా ఇచ్చారు. అసలే గ్రామీణ ప్రాంతం.. ఆపై ఆడపిల్లను చదివించడం ఎందుకు అనుకునే వారున్నా తల్లిదండ్రులు వెనుకాడలేదు. తాము కిందిస్థాయిలో ఉన్నప్పటికీ కోటి ఆశలతో తమ పిల్లల జీవితాల్లో వెలుగులు నింపేందుకు వారు పడిన కష్టం నేడు ఫలించింది. కోట్లు కుమ్మరించినా రాని ఎంబీబీఎస్ సీట్లు ప్రతిభతో ఆ విద్యార్థినులు కైవసం చేసుకున్నారు. భావి వైద్యులుగా స్థిరపడేందుకు బంగారు బాటలు వేసుకున్న ఆ పేదింటి ఆణిముత్యాల విజయంపై కథనం ఇది.

– తాడికొండ

పట్టుదలతో రెండో ప్రయత్నంలో సీటు



తల్లిదండ్రులతో పి. త్రివేణి

పొన్నెకల్లుకు చెందిన పల్లా త్రివేణి తండ్రి తాపీమేస్త్రీ కాగా, తల్లి ఇంటి వద్దే ఉంటారు. చిన్నప్పటి నుంచి పొన్నెకల్లు శ్రీసాయి పాఠశాలలో 10వ తరగతి వరకు చదివారు. ఇంటర్ భాష్యం కళాశాలలో చదివి లాంగ్ టర్మ్ కోచింగ్‌కు జాయిన్ అయ్యారు. ఎలాగైనా ఎంబీబీఎస్ చదవాలని పట్టుదలతో నీట్‌కు ప్రిపేర్ అయ్యారు. తొలి ప్రయత్నంలో కొన్ని మార్కులు సాధించగా, ఉచిత సీటు రానప్పటికీ నిరాశ చెందలేదు. రెండో ప్రయత్నంలో కష్టపడి సీటు సాధించారు. వేకువ జామున 6 గంటలకు లేచి, రాత్రి 10 గంటల వరకు భోజన విరామం మినహా చదువుపైనే ధ్యాస పెట్టారు. అందువల్లే తనకు ఉచిత సీటు సాధ్యమైందని త్రివేణి ఆనందం వ్యక్తం చేశారు. నాన్న తాపీమేస్త్రీగా పనిచేసి కష్టపడి తనను చదివించారని, తొలి ప్రయత్నంలో కొద్దిగా మార్కులు తగ్గినా పట్టుదలతో చదవడంతో రెండో ప్రయత్నంలో 70,122 ర్యాంకు సాధించినట్లు తెలిపారు. రాజమండ్రి జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో ఫ్రీ సీటు వచ్చిందని పేర్కొన్నారు. పవిత్రమైన వైద్య వృత్తిలో స్థిరపడి గైనకాలజిస్టు లేదా కార్డియాలజిస్టుగా సేవలందించాలని ఉందని త్రివేణి తెలిపారు. తమ కుమార్తె ఎంబీబీఎస్‌లో సీటు సాధించడం ఆనందంగా ఉందని, రూ.కోట్లు కుమ్మరించినా రాని సీటు ఉచితంగా పొందడంపై తల్లిదండ్రులు పల్లా సాంబశివరావు, శ్రీలక్ష్మిలు ఆనందం వ్యక్తం చేశారు. తాము చదవకపోయినా తమ కుమార్తెను కళాశాలకు పంపినందుకు తగిన ప్రతిఫలం వచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు.

తండ్రి కష్టాలు తీర్చాలనే పట్టుదలతో గెలుపు

గుంటూరుకు చెందిన బి.వెంకట గౌతమి తన తండ్రి కష్టాలను దగ్గరగా చూశారు. ఎలాగైనా కష్టపడి చదివి జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలని నిర్ణయించుకున్నారు. నేడు ఆ కలను సాకారం చేసుకునేందుకు కీలక మెట్టు ఎక్కారు. దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్న ఆమె తండ్రి గురవయ్య ఎంతో కష్టపడ్డారు. పిల్లలను పోషించుకుంటూ ఉన్నదాంట్లో వారికి మంచి చదువు చెప్పించారు. తల్లి శారద గృహిణిగా పిల్లల బాగోగులు చూసుకున్నారు. తనకు వచ్చిన రూ.20 వేల జీతంతో అమ్మాయికి చదువు చెప్పించుకుంటున్న గురవయ్య.. ఆమెలోని ప్రతిభను గుర్తించి మరింత ప్రోత్సహించారు. నారాయణ కళాశాలలో లాంగ్ టర్మ్‌లో శిక్షణ ఇప్పించారు. తొలి ప్రయత్నంలో కొద్దిగా మార్కులు తగ్గినప్పటికీ రెండో ప్రయత్నంలో 615 మార్కులతో మంచి ర్యాంకు పొందారు. మచిలీపట్నంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించారు. తమ కుమార్తెకు ఉచిత ఎంబీబీఎస్ సీటు రావడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లా నుంచి గుంటూరుకు వచ్చిన తన తండ్రి వ్యవసాయ ముఠా కూలీగా పనిచేసి తమను పోషించారని గురవయ్య తెలిపారు. 10వ తరగతి వరకు చదివి ఆపేసిన తాము.. పిల్లలను మాత్రం కష్టపడి చదివించామన్నారు. తమ కలలను సాకారం చేసేలా కుమార్తె సీటు సాధించడం ఆనందంగా ఉందన్నారు.



కన్నవారితో బి. వెంకట గౌతమి



తల్లిదండ్రులతో వై.మృదులత

ప్రభుత్వ పాఠశాలలో చదివి విజయం

తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామానికి చెందిన యామవరపు మృదులత ప్రభుత్వ పాఠశాలలో చదివారు. గ్రామంలోని కేబీ మండల పరిషత్ పాఠశాలలో 7వ తరగతి వరకు చదివి, జడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి ఉత్తీర్ణత సాధించారు. అనంతరం విద్యార్థినిలోని ప్రతిభను గమనించిన తల్లిదండ్రులు గుంటూరులోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ చదివించారు. నీట్‌కు దరఖాస్తు చేసుకొని గుంటూరులోని తాతయ్య శివశంకర్ సహకారంతో ఆయన ఇంటి వద్దే ఉండి కష్టపడి చదివారు. 71,399వ ర్యాంకుతో ఎంబీబీఎస్ ఉచిత సీటు సాధించారు. రాజమండ్రి ప్రభుత్వ వైద్య కళాశాలలో చేరారు. తల్లిదండ్రులు యామవరపు కోటేశ్వరరావు, రామలక్ష్మి దంపతులు వ్యవసాయ కూలీలు. ఓ వైపు పశుపోషణ చేసుకుంటూ, మరోవైపు వ్యవసాయ కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. అసలు చదువంటే ఏంటో తెలియని కుటుంబంలో నుంచి కష్టపడి తమ కుమార్తె ఇలా సీటు సాధించడం ఆనందంగా ఉందని తల్లిదండ్రులు తెలిపారు. తాము చదువుకోకపోయినా పిల్లలను చదివించాలనే కోరిక నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు. ఎంబీబీఎస్‌లో కార్డియాలజిస్టు లేదా న్యూరాలజిస్టుగా స్థిరపడనున్నట్లు మృదులత తెలిపారు.

జిల్లా రిజిస్ట్రేషన్ సిబ్బందికి ముగిసిన కౌన్సెలింగ్

- గుంటూరు-1 ఎస్ఆర్వోగా షరీఫ్ బాబు
- సిఫార్సు లేఖలు తెచ్చుకున్న వారికి ప్రాధాన్యమిచ్చారని సమాచారం



పోస్టింగ్‌ల కోసం డీఐజీ కార్యాలయం ముందు వేచి చూస్తున్న సిబ్బంది

గుంటూరు వెస్ట్ : స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఉమ్మడి జిల్లాకు సంబంధించి కౌన్సెలింగ్ ప్రక్రియ ఆదివారం స్థానిక జెడ్పీ ఆవరణలోని డీఐజీ కార్యాలయంలో జరిగింది. ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు, సిబ్బంది కౌన్సెలింగ్‌కు వచ్చారు. కమిటీ చైర్మన్ గుంటూరు జిల్లా డీఐజీ జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఒంగోలు, నెల్లూరు డీఐజీలు పుష్పలత, కిరణ్ కుమార్‌లు బదిలీ ప్రక్రియ నిర్వహించారు. మొత్తం 70 మంది సబ్ రిజిస్ట్రార్లకు స్థానచలనం కలిగింది. దీనిలో భాగంగా గుంటూరు జాయింట్-1 ఎస్ఆర్వోగా మంగళగిరిలో పనిచేస్తున్న షరీఫ్ బాబు, జాయింట్-2గా నరసరావుపేటలో పనిచేస్తున్న వెంకటరావును బదిలీ చేశారు. కొరిటెపాడు ఎస్ఆర్వోగా పెదకూరపాడులో పనిచేస్తున్న వెంకటేశ్వరరావును, క్రోసూరులో పనిచేస్తున్న భాస్కర్‌ను పెదకాకానికి, ప్రత్తిపాడుకు పి.శ్రీనివాసరావును, తాడికొండకు రమాదేవి, బాపట్లకు జాన్‌మోహన్ కుమార్‌లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. నల్లపాడు ఎస్ఆర్వోగా పనిచేస్తున్న గోపాల్‌ను అక్కడే ఉంచారు. దీంతోపాటు సుమారు 400 మంది సిబ్బందిని కౌన్సెలింగ్ ద్వారా వివిధ స్థానాలకు బదిలీ చేశారు. ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు తెచ్చుకున్న వారికి అధిక ప్రాధాన్యం దక్కినట్లు సమాచారం.

పరిసరాల పరిశుభ్రత ఎంతో కీలకం



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్, గుంటూరు కమిషనర్ తదితరులు

జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి

నెహ్రూనగర్: ప్రజలు తమ ఇంటితోపాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవడం ఎంతో అవసరం అని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. స్వచ్ఛతా హి సేవలో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీని ఆదివారం స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, గ్రామాల్లో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. సంస్థలు, ప్రజలు భాగస్వాములు కావడం ద్వారానే స్వచ్ఛత సాధన వీలవుతుందన్నారు. పరిసరాల పరిశుభ్రత బాధ్యత ఒక్క పారిశుద్ధ్య కార్మికులదే కాదన్నారు. అందరూ ఈ దిశగా కృషి చేయాలని కోరారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయొద్దని సూచించారు. దీన్ని ఒక ఉద్యమంగా భావించాలన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. స్వచ్ఛత సమష్టి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. నగర పాలక సంస్థ కమిషనర్ మాట్లాడుతూ.. స్వచ్ఛతపై అవగాహన కల్పించడానికి చేపట్టిన కార్యక్రమాల్లో జీఎంసీ ప్రజల భాగస్వామ్యం విరివిగా ఉంటోందన్నారు. మొక్కలు నాటడం, కార్మికులకు వైద్య పరీక్షలు, బీమాపై అవగాహన వంటివి చేపట్టినట్లు వివరించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుంచి శంకర్ విలాస్ సెంటర్ మీదుగా గుజ్జనగుండ్ల, పట్టాభిపురం మీదుగా సైకిల్ ర్యాలీ సాగింది. తిరిగి పరేడ్ గ్రౌండ్‌కు చేరుకుంది. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్లు సీహెచ్ శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ శ్యాం సుందర్, ఎంహెచ్ఓలు మధుసూదన్, రామారావు, రాంబాబు, ఆనంద కుమార్, ట్రాఫిక్ డీఎస్పీ రమేష్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలే ఏసుబాబు హత్యకు కారణం

- డీఎస్పీ రామాంజనేయులు
- కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడు చంద్రశేఖర్ అరెస్టు చూపుతున్న డీఎస్పీ

బాపట్ల: సూర్యలంక సముద్ర తీర ప్రాంతం వద్ద జరిగిన హత్య కేసులో నిందితుడిని బాపట్ల రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రామాంజనేయులు వివరాలు వెల్లడించారు. కృష్ణాజిల్లా పెద్దప్రోలుకు చెందిన ఏసుబాబు కొన్ని సంవత్సరాల నుంచి బాపట్లలో నివసిస్తూ, పరిసర ప్రాంతాల్లో ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు. బాపట్ల మండలం సూర్యలంక రహదారిలోని ఆదర్శనగర్‌కు చెందిన కొక్కిలగడ్డ చంద్రశేఖర్‌ను నెలకు రూ. పది వేలు ఇచ్చి అసిస్టెంట్‌గా పెట్టుకున్నాడు. ఈ క్రమంలో నిందితుడు కొంతమందికి అప్పుకు డబ్బులు ఇప్పించాడు. సదరు వ్యక్తులు తిరిగి చెల్లించకపోవడంతో చంద్రశేఖర్‌పై ఏసుబాబు (40) ఒత్తిడి తెచ్చాడు. దీంతో ఏసుబాబును ఎలాగైనా హత్య చేయాలని నిర్ణయించుకున్న చంద్రశేఖర్ పథకం ప్రకారం డబ్బులు ఇస్తానని అతడ్ని పిలిపించాడు. సూర్యలంక రహదారిలోని చప్టా వద్ద కోడికత్తితో మెడకుడి వైపు పొడవడంతో ఏసుబాబు ప్రాణాలు కాపాడుకోవడానికి ద్విచక్ర వాహనంపై సూర్యలంక వెళ్లి షాపుల వద్ద పడిపోయాడు. స్నేహితుడైన గోవర్ధన్‌కు చంద్రశేఖర్ అలియాస్ (చిన్ను) తనను కోడి కత్తితో పొడిచాడని చెప్పి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రూరల్ సీఐ గంగాధర్ అన్ని కోణాలలో కేసు విచారణ చేపట్టి నిందితుడైన కొక్కిలగడ్డ చంద్రశేఖర్‌ను సూర్యలంక రహదారిలోని పందెం కోడి రెస్టారెంట్ వద్ద అరెస్టు చేసినట్లు డీఎస్పీ వివరించారు. ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఏర్పడిన వివాదంలో తానే కోడికత్తితో పొడిచి హత్య చేశానని విచారణలో నిందితుడు ఒప్పుకున్నాడని వివరించారు. కేసులో కీలకంగా వ్యవహరించి నిందితుడిని అరెస్టు చేసిన సీఐ, ఎస్ఐ, సిబ్బందిని అభినందించారు.

అందినకాడికి ఊడ్చేస్తున్నారు..!

ఇటీవల గుంటూరు నగరం తూర్పు, పశ్చిమ సబ్ డివిజన్ల పరిధిలో చోరీలు ఎక్కువయ్యాయి. ఇళ్లలో, ఒంటరిగా రోడ్లపై నడిచి వెళ్లే మహిళల మెడల్లోని బంగారు గొలుసులను రెప్పపాటులో దొంగలు తెంచుకెళ్తున్నారు. ఎక్కువగా నివాసాల్లో దొంగతనాలు జరుగుతున్నాయి. మరోవైపు బంగారు వస్తువులకు మెరుగు పెడతామంటూ మోసగించే వారు ఎక్కువయ్యారు. ఇంట్లోని వారు ఊళ్లకు వెళ్లి వచ్చేలోగా.. భద్రపరిచిన ఖరీదైన బంగారు వస్తువులను ఊడ్చేస్తున్నారు. ఆఖరికి రాత్రిళ్లు నిద్రకు ఉపక్రమించి ఉదయం లేచేసరికి దాచిన రూ.లక్షల నగదు, నగలు మాయం చేస్తున్నారు కేటుగాళ్లు. రెండు నెలల వ్యవధిలో దొంగతనాలు ఎక్కువగా జరిగాయి. ఈ నెలలో సగటున రెండు రోజుకోసారి ఏదో ఒక పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీలు జరుగుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. వరుస దొంగతనాలతో నగర ప్రజలు హడలిపోతున్నారు. పోలీసులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

- రెండు రోజులకో దొంగతనం నమోదు
- ప్రజలకు దూరమైన ఎల్‌హెచ్ఎంఎస్
- గుంటూరు నగరంలో పెరిగిన చోరీలు

నగరంపాలెం: ఇటీవల గుంటూరు బ్రాడిపేటలో మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటించారు. ఈ క్రమంలో పెద్ద సంఖ్యలో వచ్చిన కార్యకర్తలు, అభిమానుల మధ్య చేరిన జేబు దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. పెదకాకాని కంతేరు గ్రామం అంబేడ్కర్ కాలనీ నుంచి పలువురు మహిళలు రాగా.. ప్రేమకుమారి అనే మహిళ మెడలోని బంగారు మంగళ సూత్రం చోరీకి యువకుడు యత్నించాడు. వెంటనే అప్రమత్తమైన మహిళలు అతడిని పట్టుకున్నారు. అదే చోట ఓ వ్యక్తి జేబులోని పర్సును దొంగిలించేందుకు ప్రయత్నించిన మరో యువకుడ్ని పట్టుకుని అరండల్‌పేట పోలీసులకు అప్పగించారు. ఈ నెల తొమ్మిదిన ఏటీ అగ్రహారంలో ఉండే ఏఆర్ కానిస్టేబుల్ ఇంట్లో పది సవర్ల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు చోరీ అయ్యాయి. ఇంటి వెనుక వైపు తలుపు గడియను పగులగొట్టిన దుండగులు లోనికెళ్లి వాటిని తీసుకుని ఉడాయించారు.

సెలవులు రావడంతో..

గడిచిన రెండు నెలల్లో పండుగలు, సెలవు దినాలు ఎక్కువగా వచ్చాయి. దీంతో ఒకట్రెండు రోజుల్లో దర్శించుకునే పుణ్య క్షేత్రాలు, పేరొందిన ప్రాంతాలకు నగరవాసులు బయలుదేరారు. ప్రయాణం ముగించుకుని ఇళ్లకు వచ్చేసరికి తలుపులకు వేసిన తాళాలు పగిలి ఉంటున్నాయి. దీంతో బాధితుల గుండెలు గుబేలు అంటున్నాయి. ఇళ్లలోకి వెళ్లి చూసేసరికి వరండా, పడక గదుల్లో వస్తువులు, దుస్తులు చెల్లాచెదురుగా పడి ఉండటం.. బీరువాల్లో దాచిన బంగారం, వెండి వస్తువులు చోరీ కావడం పరిపాటిగా మారింది. దీంతో బాధితులు కన్నీటి పర్యంతమవుతున్నారు. పోలీసులు, క్లూస్ టీంలు వచ్చి పరిశీలించడం, వేలిముద్రలు సేకరించడం షరా మాములుగా మారాయి. చోరీలు జరిగి నెలలు గడిచినా కేసు దర్యాప్తులో పురోగతి కనిపించడం



లేదని బాధితులు వాపోతున్నారు. దొంగతనం చేసిన వారు ఎవరనేది తెలిసిందా అని పోలీసులను వాకబు చేస్తే.. కేసు దర్యాప్తు చేస్తున్నామని, త్వరలో దొంగలను గుర్తిస్తామని చెబుతున్నారని బాధితులు పేర్కొంటున్నారు. కనీసం అనుమానిత వ్యక్తులను విచారించాలని కోరినా పోలీసులు పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. అనుమానితుల చిరునామాలు నమోదు చేసుకుని పంపిస్తున్నారని, వారిని విచారించడం లేదని ఓ బాధితుడు వాపోయారు.

కొరవడిన ప్రచారం

లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్ఎంఎస్)పై పెద్దగా ప్రచారం ఉండటం లేదు. ఇది ప్రజలకు చాలా ఉపయోగకరమైనది. ఎవరైనా ఊరెళ్తే ముందస్తు సమాచారాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలి. యజమాని ఇంటికి పోలీసులు చేరుకుని లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం ఏర్పాటు చేసి, అందులో భాగంగా నిఘా కెమెరాలను బిగిస్తారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశిస్తే వెంటనే పోలీసులకు సమాచారం వెళ్తుంది. దీంతో నిమిషాల వ్యవధిలో చోరులను పట్టుకోవచ్చు. గతంలో పలువుర్ని ఇలా పట్టుకున్నారు. అయితే చాలా మంది ఊళ్లకు వెళ్లేటప్పుడు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడం లేదు. దీంతో చోరులకు అవకాశం లభిస్తోంది. పోలీసులు కూడా ఈ సిస్టంపై ప్రజలకు అవగాహన కల్పించడం లేదు. ఇటీవల జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ కూడా దీనిపై దృష్టి పెట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించినా ప్రయోజనం మాత్రం లేదు. దీంతో వరుస దొంగతనాలతో ప్రజలు హడలిపోతున్నారు.

ముందుగా రెక్కీ..

నిర్మానుష్యంగా ఉండే ఏరియాలలో పగటి పూట అపరిచిత వ్యక్తులు రెక్కీ చేస్తున్నారు. తాళాలు వేసిన ఇళ్లను, పరిసర ప్రాంతాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. అర్ధరాత్రి దాటాక ఒకరిద్దరూ జత కట్టి ఈ చోరీలకు తెగబడుతున్నారు. తలుపు గడియలు, కిటికీలను తొలగించి లోనికి ప్రవేశిస్తున్నారు. ఇనుప వస్తువులతో బీరువాలను తెరుస్తున్నారు. అందిన కాడికి దోచుకెళ్తున్నారు. కొన్ని చోరీల్లో తెలిసిన వారి ప్రమేయం ఉంటోందని బాధితులు వాపోతున్నారు. గత నెలలో పశ్చిమ సబ్ డివిజన్ పరిధిలోని ఓ ఇంట్లో బంగారు వస్తువులు చోరీ కాగా.. అది తెలిసిన వారి పనేనని బాధితులు భావిస్తున్నారు. నెలకుపైగా గడిచినా కేసు దర్యాప్తులో పురోగతి లేదని వాపోయారు.

తెలిసిన వారి పనే..

రోజులా స్టూడియోకు తాళం వేశాను. మరుసటి రోజు తాళం పగులకొట్టి ఉన్నట్లు తెలిసిన వారు చెప్పడంతో హడావుడిగా వచ్చాను. స్టూడియోలో భద్రపరిచిన 5డీ కెమెరాలు, ఇతర వస్తువులు కనిపించలేదు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశా. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, వేలిముద్రలను సేకరించారు. తెలిసిన వారే దొంగిలించి ఉంటారనే అనుమానం ఉంది. కెమెరాల్లో పలు శుభకార్యాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఉన్నాయి.

– రామారావు, ఫొటోగ్రాఫర్, గుంటూరు

కొండవీడుకు పర్యాటకుల అనుమతి

నాదెండ్ల: యడ్లపాడు మండలంలోని ప్రఖ్యాత పర్యాటక కేంద్రమైన కొండవీడుకు పర్యాటకులను ఆదివారం నుంచి అనుమతించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఘాట్‌రోడ్డులో కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో అధికారులు పర్యాటకుల రాకపోకలు నిలిపివేశారు. అటవీశాఖ, ఆర్అండ్‌బీ అధికారులు ఘాట్‌రోడ్డుపై పడిన కొండరాళ్లను తొలగించి రహదారికి మరమ్మతులు చేశారు. ఆదివారం ఉదయం తనిఖీల అనంతరం రాకపోకలకు అనుమతించారు. రెండు వారాల నుంచి రాకపోకలు నిలిపివేయడంతో ఆదివారం పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. కొండపై



ఏర్పాటు చేసిన నగరవనంలో పర్యాటకుల సందడి నెలకొంది.

క్లుప్తంగా

వట్టిచెరుకూరులో 23.2 మి.మీ. వర్షపాతం

కొరిటిపాడు (గుంటూరు): గుంటూరు జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు అత్యధికంగా వట్టిచెరుకూరు మండలంలో 23.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా కొల్లిపర మండలంలో 0.6 మి.మీ. పడింది. సగటు 6 మి.మీ.గా నమోదైంది. గుంటూరు తూర్పు మండలంలో 18.2, ప్రత్తిపాడు 12.8, పొన్నూరు 10.2, తుళ్ళూరు 10.2, తాడికొండ 8.4, మేడికొండూరు 7.8, గుంటూరు పశ్చిమ 5.4, మంగళగిరి 4, తాడేపల్లి 3.4, పెదకాకాని 1.8, ఫిరంగిపురం మండలంలో 1.2 మి.మీ. చొప్పున వర్షపాతం పడింది. సెప్టెంబర్ 22వ తేదీ నాటికి జిల్లాలో సాధారణ వర్షపాతం 101.1 మి.మీ. కాగా, ఇప్పటి వరకు 241.1 మి.మీ. వర్షపాతం నమోదైంది.

పింఛన్లు సరళ పద్ధతిలో ఇవ్వాలని వినతి

కొరిటిపాడు(గుంటూరు): ఏటా లైవ్ సర్టిఫికెట్ పద్ధతి కాకుండా డిజిటలైజేషన్ ద్వారా సరళ విధానంలో తమకు పెన్షన్లు అందించాలని పొగాకు బోర్డు పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు యు.వెంకట్రావు కోరారు. అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జీటీ రోడ్‌లోని రైతు భవన్‌లో ఆదివారం జరిగింది. 75 ఏళ్లు వయస్సు నిండిన సభ్యులు నన్నపనేని అమర్నాథ్, స్థాపక్‌లను సత్కరించారు. వెంకట్రావు మాట్లాడుతూ.. బోర్డులో సుదీర్ఘకాలం పనిచేసి రైతులకు ఎన్నో సేవలను వీరిద్దరు అందించారని ప్రశంసించారు. బోర్డు స్థాపనకు, వేలం విధానం రావటానికి కృషి చేసిన కొత్త రఘురామయ్య, బీవీ శివయ్య, ఎంసీ మహాపాత్ర, ఇతర రైతు నాయకుల కృషిని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు బీఎస్ మిత్ర, సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేరుస్తాం

మంత్రి నాదెండ్ల మనోహర్



తెనాలి అర్బన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. బోసు రోడ్డులోని జనసేన పార్టీ తెనాలి నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలు కోరుకున్న మంచి పాలనను వంద రోజుల్లో అందించడం జరిగిందన్నారు. తెనాలి ప్రాంతంలో 80 శాతం గంజాయి నిర్మూలించామని తెలిపారు. సమావేశంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, నాయకులు పసుపులేటి మురళీకృష్ణ, బండారు మురళీకాంత్, జిడుగు తులసి, ఇస్మాయిల్ బేగ్, హరిదాసు గౌరీశంకర్, మామిడిబత్తుల సుబ్రమణ్యం, దంతాల కిరణ్‌కుమార్, షేక్ జాకీర్ హుస్సేన్, దివ్వెల మధుబాబు, చెట్టుపల్లి శ్రీనివాసరావు, బెల్లపు యశ్వంత్, జెట్టి గుణ, శ్రీనివాసరావు తదితరుల పాల్గొన్నారు.

కత్తి పద్మారావుకు జాషువా పురస్కారం ప్రదానం



డాక్టర్ కత్తి పద్మారావును సత్కరించిన సంస్థ సభ్యులు

పొన్నూరు: రచనల ద్వారా సమాజాన్ని చైతన్య పరిచిన మహాకవి గుర్రం జాషువా సాహితీ పురస్కారాన్ని ప్రముఖ కవి, ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ వ్యవస్థాపకులు డాక్టర్ కత్తి పద్మారావుకు ప్రదానం చేయడం అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. జాషువా జయంతిని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని లుంబినీవనంలోని పగిడిపల్లి వెంకటేశ్వర్లు సాహిత్య వేదికపై ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటైంది. ఖమ్మానికి చెందిన జాషువా సాహిత్య వేదిక ఆధ్వర్యంలో డాక్టర్ కత్తి పద్మారావుకు 'మన కాలపు జాషువా' సాహితీ పురస్కార ప్రదానోత్సవం నిర్వహించారు. సభకు మొవ్వ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా కోయి కోటేశ్వరరావు, అంబటి మురళీ పాల్గొన్నారు. జాషువా ఆశయ సాధన కోసం తన రచనలతో సమాజాన్ని చైతన్య పరిచేందుకు కృషి చేస్తున్న కత్తి పద్మారావు అభినందనీయులని పేర్కొన్నారు. అనంతరం కత్తి పద్మారావుకు పురస్కారాన్ని ప్రదానం చేసి, ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కత్తి చేతన్, గద్దం విజయరావు, డాక్టర్ కనపర్తి అబ్రహాం లింకన్, మాధవ, సందీప్, సతీష్, తెనాలి అంబేడ్కర్ సేవా ట్రస్ట్ సభ్యులు, అంబేడ్కర్ వాదులు, దళిత మహాసభ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా బండలాగుడు పోటీలు



జూనియర్స్ విభాగంలో బండలాగుతున్న గిత్తలు

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో నందమూరి తారక రామారావు మెమోరియల్, నూతలపాటి పరమేశ్వరరావు మెమోరియల్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎడ్ల బండలాగుడు పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. ఆదివారం జూనియర్స్ విభాగంలో పల్నాడు, బాపట్ల, గుంటూరు, కృష్ణా జిల్లాలతోపాటు తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నుంచి గిత్తలు పోటీల్లో పాల్గొన్నాయి. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన డి. రోహన్ బాబు గిత్తలు 2,523.3 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం బురుజుపల్లికి చెందిన సోమిశెట్టి ఆంజనేయులు, యరమల మోక్ష అదరన్ గిత్తలు 2481.4 అడుగులు లాగి ద్వితీయ స్థానం, తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన డి.రోహన్‌బాబుకు చెందిన మరి జోడీ గిత్తలు, బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీష చౌదరి గిత్తలు సమానంగా 2,408.1 అడుగుల లాగి తృతీయ స్థానం సాధించాయి. వీరికి కమిటీ సభ్యులు నగదు బహుమతులు, మెమెంటోలను అందజేశారు.

అక్టోబర్‌లో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలు స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో వచ్చే నెల 14, 15 తేదీల్లో నిర్వహిస్తామని రాష్ట్ర అధ్యక్షులు లాల్ వజీర్ తెలిపారు. ఆదివారం స్థానిక స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సర్వసభ్య సమావేశంలో వజీర్ మాట్లాడుతూ 14 జిల్లాలకు సంబంధించిన అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారని, ఆయా జిల్లాలకు సంబంధించిన అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నికలకు కూడా తాము సహకరిస్తామన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ ఆధారంగా నేషనల్స్‌కు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శ్రీలక్ష్మి, మదిలేటి రెడ్డి, షేక్ నజీర్, ప్రభుదాస్, ఫ్లోరా, కొచ్చి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మాపై వచ్చిన ఆరోపణలను నమ్మొద్దు

సోనోవిజన్ మేనేజింగ్ పార్టనర్ పొట్లూరి భాస్కరమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కరమూర్తి

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): మంగళగిరి ఆస్తి వివాదంలో తమపై వచ్చిన ఆరోపణలను నమ్మొద్దని సోనోవిజన్ మేనేజింగ్ పార్టనర్ పొట్లూరి భాస్కరమూర్తి పేర్కొన్నారు. ఆదివారం ఏలూరు రోడ్డులోని సోనోవిజన్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మంగళగిరి పాత కళాబార్ ఆస్తి వివాదం గురించి స్పందించారు. భాస్కరమూర్తి మాట్లాడుతూ.... ''సోనోవిజన్ సంస్థకు మంగళగిరి, గౌతమ బుద్ధ రోడ్డులో 1,275 చ.గ. స్థలం ఉంది. ఈ ఆస్తిని ఆళ్ల సురేష్‌బాబు 2004లో తల్లం జగన్మోహన్‌రావు, మరో 10 మంది వద్ద కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. 2005 నుంచి ఆళ్ల సురేష్‌బాబు కళాబార్ పేరిట వ్యాపారం నిర్వహించారు. అప్పట్లో ఈ స్థలంపై ఎలాంటి వివాదాలూ లేవు. 2017 జూలై నెలలో ఆళ్ల సురేష్‌బాబు స్థలాన్ని అమ్మకానికి పెట్టగా.. మా పార్టనర్ శివ సంజీవ జనార్దనమూర్తి కొనుగోలు చేశారు. తర్వాత జనార్దనమూర్తి అమెరికా వెళ్లే సమయంలో స్థలాన్ని సోనోవిజన్ ఎంటర్ ప్రైజెస్‌కు లీజుకు ఇచ్చి, రిజిస్ట్రేషన్ చేశారు. ఆస్తిపై పూర్తి హక్కులు సోనోవిజన్‌కు కట్టబెట్టారు. ఆరు సంవత్సరాలుగా సదరు ఆస్తి సోనోవిజన్ స్వాధీనంలో ఉంది. 2017లో కళాబార్ బిల్డింగ్ పడగొట్టి షోరూం బిల్డింగ్ నిర్మాణానికి ప్లాన్ అప్లై చేశాం. 2019లో తల్లం జగన్మోహన్‌రావు కొంత మంది మధ్యవర్తులతో వచ్చి ఆస్తిని తన మేనమామ 1988లో వీలునామా ద్వారా తనకు ఇచ్చారని, తన వద్ద లింక్ డాక్యుమెంట్లు కూడా ఉన్నాయని, తనకు రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2004లో ఆళ్ల సురేష్‌బాబుకు ఆస్తిని విక్రయించిన వారిలో ఒకరైన తల్లం జగన్మోహన్‌రావు.. 16 ఏళ్ల తర్వాత వచ్చి ఆస్తి తనదేనని అడగడంతో అనుమానం వచ్చి న్యాయ నిపుణులను సంప్రదించాం. వీలునామాలో పేర్కొన్న విషయాలు తప్పులతడకగా, అనుమానాలు రేకెత్తించేవిగా ఉన్నాయి. దీంతో వీలునామా ఫోర్జరీ అని తేలింది. 2004లో ఆళ్ల సురేష్‌బాబుకు స్థలం అమ్మిన వారిలో తల్లం జగన్మోహన్‌రావుతోపాటు ఇతరులు 10 మంది ఉన్నారు. అతనిపై అనుమానం వచ్చి అప్పట్లో గవర్నర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. తల్లం జగన్మోహన్‌రావు, అతని తల్లి, సోదరి కలిసి మాపై మంగళగిరి కోర్టులో దావా వేశారు. ఆ కేసును కోర్టు కొట్టివేసింది. అయినప్పటికీ తల్లం జగన్మోహన్‌రావు, అతని తల్లి నాగమల్లేశ్వరి మమ్మల్ని వేధిస్తున్నారు. వేధింపుల్లో భాగంగా ఇద్దరూ కలిసి ఆస్తిలో కొంత భాగం 2022లో షేక్ మొహమ్మద్‌కు, మరికొంత భాగం షేక్ నాగుల్ పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. వారికి హక్కులు లేవని తెలిసి కూడా ఇలా చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఇరువురిపైనా పోలీసులు కేసు నమోదు చేశారు. స్థలం 2017 నుంచి మా స్వాధీనంలోనే ఉంది. అంతకు ముందు మాకు విక్రయించిన ఆళ్ల సురేష్‌బాబు స్వాధీనంలో ఉంది. 2017లో ఓపెనింగ్ షార్ట్‌లీ అని మా సంస్థ బోర్డు కూడా ఏర్పాటు చేశాం. అయినప్పటికీ బుల్డోజర్‌తో ప్రహరీ కూలగొట్టారు. మా స్థలంలోకి వెళ్లి దౌర్జన్యం చేయడం ఎంతవరకు సమంజసం? వయసు పైబడిన మా తల్లిదండ్రులు, కుటుంబసభ్యులపైనా కేసులు పెట్టారు. మూడేళ్లుగా మమ్మల్ని వేధిస్తున్నారు. మేం వివాదాల జోలికి వెళ్లం. మాపై వచ్చిన నిరాధార ఆరోపణలు నమ్మొద్దని కోరుతున్నట్లు'' పేర్కొన్నారు.

జాతి ప్రయోజనాల కోసమే పార్టీలకు మద్దతు

ఆత్మీయ సమ్మేళనంలో మంద కృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

తెనాలి రూరల్: జాతి ప్రయోజనాల కోసమే తాను ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీలకు మద్దతిచ్చానని, ఏ నిర్ణయమైనా జాతి భవిష్యత్తు కోసమే అని విశ్వసించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ విజ్ఞప్తి చేశారు. తెనాలి సుల్తానాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మాదిగల ఆత్మగౌరవ ఆత్మీయ సమ్మేళనం శనివారం రాత్రి వేడుకగా జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పుతో జాతి స్వప్నం సాకారం అయ్యిందన్నారు. ఈ పోరాటంలో కొంత మంది ప్రాణాలు వదిలారని, ఈ తీర్పు వారికే అంకితమని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అప్పట్లో వర్గీకరణకు అనుకూలంగా ఉన్నా, కాంగ్రెస్‌లోని మాల నాయకులు కొందరు అడ్డుకున్నారని ఆరోపించారు. తీర్పు ఫలితాలు అందితేనే పోరాటానికి సార్థకత చేకూరుతుందని అన్నారు. రాష్ట్ర జీఎస్టీ కమిషనర్ (ఆడిట్) పులపాక ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎనిమిది శాతం ఉన్న మాదిగలు రాజ్యాధికారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ బుదాల కోటేశ్వరరావు మాట్లాడుతూ.. మాదిగలు విద్యా సంస్థలు ఏర్పాటు చేసి, పిల్లలను చదివించి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని సూచించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, బిషప్ సురేష్ కుమార్, ప్రముఖ న్యాయవాది మట్టా జయకర్, ప్రొఫెసర్ పొన్నెకంటి రత్నాకర్, ఎమ్మార్పీఎస్ నాయకులు ముస్నంగి నాగరాజు, రుద్రపోగు సురేష్, విశ్రాంత డీఐజీ చావలి బాలస్వామి, బాపట్ల ఆర్డీవో గంధం రవీంద్ర, ఎంఈఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిలుమూరి శ్రీనివాసరావు, ఆలపాటి కరుణ తదితరులు మాట్లాడారు. ఆహ్వాన కమిటీ సభ్యులు పులివర్తి లక్ష్మయ్య, మేకల సురేష్, సీనియర్ ఏపీపీ సుద్దపల్లి సుకుమార్, హైకోర్టు న్యాయవాది మేకల రవికుమార్, అత్తోట శ్యామ్, అత్తోట శరత్, బీజేఆర్ కమిటీ సభ్యులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



పంచనామా నిర్వహిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలి రూరల్: అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందింది. వివరాలు.. కొల్లిపర మండలం సిరిపురం గ్రామానికి చెందిన అత్తోట వసంతలక్ష్మి (33) మొదటి భర్తతో విడిపోయి తెనాలి నాజరుపేటకు చెందిన వడ్డే కరీమ్ పృథ్వీని రెండో వివాహం చేసుకుంది. వీరికి ఆగస్టు 29న మగబిడ్డ పుట్టాడు. ఈ నెల 13న తలకు తీవ్ర గాయంతో తెనాలిలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందింది. రెండు రోజులకు తల నొప్పి రావడంతో గుంటూరు జీజీహెచ్‌లో చేరింది. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. వివాహమై ఏడాదే కావడంతో శవ పంచనామా నిర్వహించాలని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణను వన్‌టౌన్ పోలీసులు కోరారు. ఆదివారం గుంటూరు వైద్యశాలలోని మార్చురీకి వెళ్లిన తహసీల్దార్ పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐదేళ్ల బాలుడు మృతి

- కన్నీరుమున్నీరుగా విలపించిన కన్నవారు
- పారిశుద్ధ్య లోపమే కారణమని స్థానికుల ఆరోపణ



మంగళగిరి: అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న ఐదు సంవత్సరాల బాలుడు అకస్మాత్తుగా మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. పాత మంగళగిరిలో నివాసముంటున్న ఊట్ల వేణు, శివపార్వతిల కుమారుడు ద్వారకా కృష్ణ. శనివారం సాయంత్రం 5 గంటల వరకు హుషారుగా ఆడుకున్నాడు. ఏడు గంటల ప్రాంతంలో చిన్నపాటి జ్వరం రాగా.. తల్లిదండ్రులు ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి బాలుడి పరిస్థితి విషమంగా ఉందన్నారు. దీంతో విజయవాడ రెయిన్ బో ఆసుపత్రికి తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. తల్లితండ్రులు విషాదంలో కూరుకుపోయారు. స్థానికులు మాట్లాడుతూ.. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే బాలుడు మృతి చెందినట్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంతో దోమలు ఎక్కువ అయ్యాయని తెలిపారు. దోమకాటుతో విషజ్వరం కారణంగా బాలుడు మృతి చెందాడని పేర్కొన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఒకే ప్రాంతంలోని రెండు ఇళ్లలో దొంగతనాలు

భారీగా నగదు, బంగారం చోరీ

లక్ష్మీపురం: ఒకే ప్రాంతంలో రెండు ఇళ్లలో భారీ చోరీలు జరిగాయి. పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఎస్‌వీఎన్ కాలనీ ప్రాంతంలో జరిగిన ఈ దొంగతనాలతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. పోలీసుల కథనం ప్రకారం ..... ఎస్‌వీఎన్ కాలనీ 4వ లైన్‌లో ఇంటి యజమాని మద్దు వెంకట శంకరరావు, మహాలక్ష్మి దంపతులు శనివారం మధ్యాహ్నం బయటకు వెళ్లారు. ప్రధాన తలుపులు పగలగొట్టిన దుండగులు బీరువాలోని రూ.2 లక్షల నగదు, 520 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఎస్సై మధు పవన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎస్‌వీఎన్ కాలనీ 7వ లైన్‌లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి కూచిబోట్ల సూర్యనారాయణ ఇంటి వెనుక భాగంలో కిటికీ గ్రిల్స్ పగలగొట్టిన దుండగులు ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలో ఉన్న 80 సవర్ల బంగారు ఆభరణాలతో పరారయ్యారు. ఆదివారం ఉదయం విషయం వెలుగుచూసింది. పట్టాభిపురం సీఐ వీరేంద్ర, ఎస్సై రాంబాబు, సిబ్బంది వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంద కృష్ణ మాదిగకు కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సుల వినతి



మంద కృష్ణకు వినతి పత్రం అందజేస్తున్న నర్సులు

గుంటూరు మెడికల్: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగను ఆదివారం గుంటూరులో కలిసి తమ సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలని గుంటూరు జీజీహెచ్ కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు వినతి పత్రం అందజేశారు. తెలంగాణలో రెగ్యులర్ స్టాఫ్‌నర్సుల ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లు సకాలంలో ఇస్తున్నారని, ఏపీలో 15 ఏళ్లుగా ఇలా ఇవ్వకపోవటంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. ప్రభుత్వం ఈనెల 4న విడుదల చేసిన జీఓ నెంబర్ 115ను వెనక్కి తీసుకునేలా చూడాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించారు. వినతి పత్రం అందజేసిన వారిలో కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సుల యూనియన్ నేతలు ఆలూరి స్వరూపారాణి, శైలజ, మేరీ కుమారి తదితరులు ఉన్నారు. కాగా, గుంటూరు జీజీహెచ్‌లో చేపట్టిన నిరసన కార్యక్రమం ఆదివారానికి 18వ రోజుకు చేరుకుంది. నల్లబ్యాడ్జీలు ధరించి, విధులు బహిష్కరించి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట సిబ్బంది నినాదాలు చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సుల యూనియన్ నేతలు పి. మనీష, స్వరూపారాణి, రేణుక, శైలజ, మేరీ కుమారి, బి.శివమ్మ, వి.విజయ్‌కుమార్, కోటేశ్వరి, సౌజన్య, హైమావతి, సంధ్య, అంజమ్మ, కరుణ, సురేష్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి

లక్ష్మీపురం: పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం ఎస్టీయూ గుంటూరు జిల్లా శాఖ ద్వితీయ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సరెండర్ లీవ్ బిల్లులు 2022 నుంచి ఇప్పటి వరకు క్రెడిట్ కాలేదని, ఏపీజీఎల్ఐ లోన్, ఫైనల్ పేమెంట్స్, చాలా కాలం నుండి బకాయిలు ఉన్నాయని, పీఎఫ్ లోన్, ఫైనల్ పేమెంట్స్ కూడా గత మార్చి నుంచి జమ కాలేదని అన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లు కూడా చాలా కాలం నుంచి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకోకపోతే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఎ.ఐ.ఎస్.టి.ఎఫ్ ఆర్థిక కార్యదర్శి సీహెచ్.జోసెఫ్ సుధీర్‌బాబు మాట్లాడుతూ ప్రాథమిక విద్య మనుగడకు ప్రశ్నార్థకమైన జీవో 117ను వెంటనే రద్దు చేయాలని, ఆంగ్ల మాధ్యమంతోపాటు తెలుగు మధ్యమాన్ని కొనసాగించాలని, శాశ్వత బదిలీ కోడ్ రూపొందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు డి. పెదబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కె.సుబ్బారెడ్డి మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎస్.రామచంద్రయ్య, ఉపాధ్యక్షులు కె.జోజప్ప, జిల్లా గౌరవాధ్యక్షులు ఏ.వి.ప్రసాద్‌బాబు, రాష్ట్ర కౌన్సిలర్ కె.శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు డి.వి.సుబ్బారావు, వై శ్యాంబాబు, కె. సద్గుణరావు, ఎండీ సాలార్ బేగ్, మధుబాబు, జి.మిధున్, హనుమంత ప్రసాద్, మస్తాన్‌రావు, ఏడుకొండలు, పి.ప్రసాద్, పి. దిబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో మందుబాబు వీరంగం

అద్దంకి రూరల్: పూటుగా మద్యం తాగి ఓ వ్యక్తి ఆర్టీసీ బస్టాండ్‌లో వీరంగం సృష్టించాడు. ఆదివారం అద్దంకి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ప్రయాణికులను, ఆర్టీసీ ఉద్యోగులనుపై దురుసుగా ప్రవర్తిస్తూ, దుర్భాషలాడాడు. డిపో సిబ్బంది వివరాల మేరకు.. మండలంలోని చినకొత్తపల్లి గ్రామానికి చెందిన దాసరి చినమస్తాన్ చీమకుర్తిలో నివాసం ఉంటున్నాడు. బంధువుల దిన కార్యక్రమాలకు వెళ్లడానికి ఒంగోలు నుంచి నరసరావుపేట వెళ్లే బస్సులో ఎక్కి అద్దంకిలో దిగాడు. ఈ క్రమంలో బస్సు లేటయిందని నరసరావుపేట బస్సు డ్రైవర్, కండక్టర్‌పైనా దురుసుగా ప్రవర్తిస్తూ దుర్భాషలాడాడు. ఇదేంటని ప్రయాణికులు వారించటంతో వారిపై కూడా చేయి చేసుకున్నాడు. తాను లారీ డ్రైవర్‌నని, మార్కాపురం, త్రిపురాంతకం, దొనకొండ ప్రాంతాల్లో పలు మర్డర్ కేసులు ఉన్నాయని, తన జోలికి వస్తే ఎమైనా చేస్తానని బెదిరించసాగాడు. ఈ క్రమంలో డిపో సెక్యూరిటీ అక్కడకు చేరకుని పట్టుకోవడానికి ప్రయత్నించగా రోడ్డు మీదకు పరారయ్యాడు. అయినా వదలకుండా వెంట బైకుమీద వెళ్లి పట్టుకుని పోలీసు స్టేషన్‌లో అప్పగించారు.

వరద బాధితులకు నిత్యావసర కిట్లు పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న కస్టమ్స్, జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి

లక్ష్మీపురం: వరద ప్రభావిత ప్రాంతాల్లో రెండు రోజులపాటు నిరంతర సేవలు అందించి, ముంపు నుంచి బాధితులను కాపాడిన కస్టమ్స్, జీఎస్టీ అధికారులు ఇప్పుడు అదే బాధితులకు అండగా నిలుస్తూ, సాయం చేసేందుకు ముందుకు వచ్చారని కేంద్ర కస్టమ్స్, జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం విజయవాడలోని పలు ముంపు ప్రాంతాల్లోని బాధితులకు కేంద్ర కస్టమ్స్, జీఎస్టీ కమిషనర్ ఆధ్వర్యంలో నాలుగు లారీల సరకులను అందజేశారు. ముందుగా జీఎస్టీ ప్రధాన కార్యాలయం వద్ద రిలీఫ్ కిట్లతో కూడిన నాలుగు వాహనాలకు కస్టమ్స్, జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ రూ.12 లక్షల విలువైన పద్నాలుగు వందల రిలీఫ్ కిట్‌లు విజయవాడలోని కండ్రిక, వైఎస్సార్ కాలనీ, వాంబే కాలనీ, రాజీవ్ నగర్ ప్రాంతాలలోని వరద బాధిత కుటుంబాలకు అందజేసినట్లు తెలిపారు. బాధితులకు సాయం అందించేందుకు తమ ఉద్యోగులు చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఐ ఆర్ ఎస్ అధికారులు కాకర్ల ప్రశాంత్‌కుమార్, బి.లక్ష్మీనారాయణ, బి.రవికుమార్, ఎం.నాగరాజు, జి.సీతారామరాజు జీఎస్టీ సూపరింటెండెంట్లు గాదె శ్రీనివాసరెడ్డి, ఈశ్వర్, చిట్టి వేంకటేశ్వరరావు, శ్రీకాంత్, సురేష్, కాకర్ల, శాఖమూరి, ప్రశాంత్ తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

జాషువా పద్యాల్లో నవరసాలు



గరికపాటి గురజాడను సత్కరిస్తున్న దృశ్యం

నగరంపాలెం: సామాజిక అధికార కవి జాషువా అని కేంద్రీయ విశ్వవిద్యాలయం (అనంతపురం జిల్లా) తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ గరికపాటి గురజాడ అన్నారు. మహాకవి గుర్రం జాషువా 129వ జయంతి వారోత్సవాల్లో భాగంగా మహాకవి జాషువా కళాపీఠం ఆధ్వర్యంలో బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై జాషువా పద్యానికి పట్టాభిషేకం అంశంపై ఆదివారం సభ జరిగింది. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ అధ్యక్షత వహించారు. తొలుత గరికపాటి గురజాడను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జాషువా పద్యాల్లో నవరసాలు ఉంటాయని ప్రశంసించారు. జాషువా సున్నితమైన మనస్కుడని, అదే ఆ కవికి ఉన్న గొప్ప లక్షణమని అన్నారు. ప్రపంచంలోని ప్రతి వస్తువులో భగవంతుడిని చూశారని తెలిపారు. కన్నతల్లిని ప్రేమించిన వారే సమాజాన్ని ప్రేమిస్తారని స్పష్టం చేశారు. మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ.. గుర్రం జాషువా సమాజ కవి అని అన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, ఎంజేఎస్ఎస్ అధ్యక్షుడు పినపాటి మోహనరావు, ప్రముఖ న్యాయవాది గద్దం ఎలీషా, కవి, నాటక ప్రయోక్త డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్, సాహితీ పరిశోధకులు పారా అశోక్, అత్తోట జోసెఫ్, జన చైతన్య వేదిక అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, ఆలయ కమిటీ కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తండ్రి మందలించాడని యువకుడు ఆత్మహత్య

మంగళగిరి: ప్రేమ వ్యవహారమై తండ్రి మందలించారని యువకుడు ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని టిడ్కో గృహాలలో నివాసం ఉంటున్న ఉడతా ఉపేంద్ర కుమారుడు నాగసాయి(22) ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్నాడు. ప్రేమ వ్యవహారంలో తండ్రి మందలించడంతో బంధువుల నివాసానికి వెళ్లి విషం తీసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.